క్లుప్తంగా

సిరుల తల్లికి ఘనంగా సహస్ర తులసి పూజ



కనకమహాలక్ష్మి అమ్మవారి సహస్ర తులసి పూజల్లో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం సహస్ర తులసి పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలో 28 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో పూజా రుసుము చెల్లించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు సత్య రూపవాణి, ఎస్. సతీష్, ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్. సురేష్, ఆలయ ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మహా అన్నదానం



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్: స్వామి వివేకానంద జయంత్యుత్సవాల్లో భాగంగా పాతనగరం స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్, సీనియర్ పాత్రికేయుడు వీవీ రమణమూర్తి, వి. భాస్కరరావు, రౌండ్ టేబుల్ చైర్మన్ మక్సూద్ అహ్మద్, పలువురి సహాయ సహకారాలతో సుమారు 2 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్టు సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో కొణతాల శ్రీనివాస్, చింతపల్లి పోతురాజు, బండారు గజపతిస్వామి, భానోజీరావు, డి. లక్ష్మణ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'కెమికల్' విద్యార్థినికి ఉత్తమ ప్యాకేజీతో ఉపాధి



మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) విద్యార్థిని దాసరి వంశీప్రియాంక ఉత్తమ ప్యాకేజీతో ఉపాధి పొందింది. రూ.6.73 లక్షల వార్షిక వేతనంతో ఏసియన్ పెయింట్స్ కంపెనీలో ఉద్యోగం సాధించింది. ఇంతవరకు డిప్లమా విద్యార్థులకు ఇంతటి ప్యాకేజీతో ఉద్యోగం వచ్చిన దాఖలాలు లేవని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. వంశీప్రియాంక ఈ కాలేజీలో కెమికల్ ఇంజినీరింగు కోర్సులో 2018లో చేరి 2022 ఏప్రిల్‌లో పాస్‌అవుట్ అయింది. ఈమెకు అచ్యుతాపురంలోని ఏసియన్ పెయింట్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ప్రిన్సిపాల్‌తో పాటు డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, డాక్టర్ ఎం.విజయలక్ష్మి.. ప్రియాంకను అభినందించారు.

విశాఖ-రాయగడ సెక్షన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం - రాయగడ సెక్షన్ పరిధిలో గురువారం డీఆర్‌ఎం అనూప్ కుమార్ సత్పతి విండో ట్రయలింగ్ తనిఖీలు నిర్వహించారు. ఆయా రైల్వే స్టేషన్లలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, స్టాక్‌ను పరిశీలించారు. ఈ సెక్షన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన సమీక్షించారు. రాయగడ స్టేషన్‌లో అధికారులు, సిబ్బందితో డీఆర్‌ఎం మాట్లాడారు. ప్రయాణికులతో మాట్లాడి, వారి సమస్యలను, సూచనలను స్వీకరించినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. తనిఖీల్లో సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్(జి) మనబేష్ మిశ్రా, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సిహెచ్.రఘువీర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కుంచుమాంబ పరస



భజన చెట్టును ఊరేగిస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్ తదితరులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 37 వార్డు పరిధి ఎగువ రెల్లి వీధిలో వెలసిన కుంచుమాంబ పరస మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అంబేడ్కర్ రెల్లికుల సంక్షేమ సంఘం (ఉత్సవ కమిటీ) ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని ప్రముఖ సంఘ సేవకుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీవత్సవ్ మాట్లాడుతూ గ్రామాలను చల్లగా చూసే గ్రామదేవతల పండగలను ఏటేటా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రంగుల రాట్నం, సాముగరిడి, పులివేషాలు, తప్పెటగుళ్లు, కోలాటం, లలిత సంగీతం, క్లాసికల్ డ్యాన్స్, డ్యాన్స్ బేబీ డాన్స్ వంటి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భజన చెట్టును ఊరేగించారు. ఎగువ రెల్లి వీధి, దిగువరెల్లివీధి, కోడిపందాల వీధి, జబ్బరతోట, పెయిన్‌దొరపేట, ఏవీఎన్ కాలేజీ డౌన్ రోడ్డు, గొడారిగోతులు, పంజా జంక్షన్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ రెల్లికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వద్దాది రాజు నేతృత్వంలో నిర్వహించిన



పోలీస్ బందోబస్త్

కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు టుపాకుల వెంకటప్రసాద్, భూపతి అప్పలరాజు, కార్యదర్శి నిమ్మకాయల శివాజీ, సహాయ కార్యదర్శి చెన్నా లక్ష్మీపతి, మంగళగిరి శివ, భూపతి కృష్ణప్రసాద్, వద్దాది సురేష్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఎల్ఐసీని బలోపేతం చేయండి'

డాబాగార్డెన్స్: ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని, ఎల్ఐసీని బలోపేతం చేయాలంటూ జీవిత బీమా రంగ ఉద్యోగులు నినదించారు. జీవిత బీమా వ్యాపార జాతీయీకరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం డివిజనల్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆ యూనియన్ అధ్యక్షురాలు ఎం. కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి. వరప్రసాదరావు మాట్లాడుతూ 1956లో ఇదే రోజున అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి సీడీ దేశ్‌ముఖ్ జీవిత బీమా ఆర్డినెన్స్ జారీ చేసి దేశంలో జీవిత బీమా రంగంలో ఉన్న 245 ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలను జాతీయం చేశారన్నారు. ప్రజల డబ్బు.. ప్రజల కోసమే అనే నినాదంతో జీవిత బీమా వ్యాపార జాతీయీకరణ చేయాలనే డిమాండ్ స్వాతంత్ర్యోద్యమ సమయంలో అంతర్భాగంగా ఉందని, ఎల్ఐసీ దశాబ్దాలుగా, స్థిరంగా తన లక్ష్యాలు నెరవేరుస్తుందన్నారు. 1956లో రూ.5 కోట్ల ప్రారంభ మూలధనంతో ప్రారంభమైన ఎల్ఐసీ ఇప్పుడు రూ.42 లక్షల 30 వేల 617 కోట్ల ఆస్తులతో, రూ.37 లక్షల 35 వేల 760 కోట్ల లైఫ్ ఫండ్ కలిగి వ్యాపారంలో ప్రగతి కనబరుస్తుందన్నారు. ఇంత దృఢమైన స్థితిలో ఎల్ఐసీలో ప్రభుత్వం తన వాటాలో 3.5 శాతం ఉపసంహరించిందని, ఇది ఎల్ఐసీ మౌలిక లక్ష్యాలకు విఘాతం కల్గించే చర్య అన్నారు. పాలసీదారుల ప్రయోజనాలు దెబ్బతీసే చర్యగా పేర్కొన్నారు. అంతేగాక ప్రైవేటీకరణకు మొదటి అడుగని, కాబట్టి ఎల్ఐసీలో ఐపీవోను బీమా ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. భోజన విరామ సమయంలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

22న హౌస్ బిల్డింగ్ సొసైటీ మహాజన సభ

మహారాణిపేట: ఈనెల 22వ తేదీన మధురవాడలోని కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయంలో ది విశాఖపట్నం జిల్లా ఏపీ స్టేట్ గవర్నమెంట్ డ్రైవర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ మహాజన సభ నిర్వహిస్తున్నట్టు సొసైటీ చైర్మన్ జె.సత్యనారాయణ తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశంలో ప్రధానంగా హౌస్ బిల్డింగ్ సొసైటీ ద్వారా ఇళ్ల స్థలాల కేటాయింపు విషయమై ఇంత వరకు ప్రభుత్వంతో జరిగిన చర్చలు, బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు సభ్యులకు వివరించనున్నట్లు తెలిపారు. విశాఖ జిల్లా సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంకులో ఉన్న సొసైటీ నిధులకు సంబంధించి జమ, ఖర్చులు సభ ఆమోదం పొందడం, జిల్లా కోపరేటివ్ యాక్ట్ ప్రకారం సొసైటీ బైలా, అడిటర్ అభ్యంతరం ప్రకారం డైరెక్టర్లుగా రెండేళ్లు పదవీ కాలం పూర్తి చేసిన వారిని మార్పు చేయడం వంటి వాటిపై సమావేశంలో చర్చించనున్నట్టు గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన తెలిపారు. ఈ మహాజన సభకు ఏపీ గవర్నమెంట్ డ్రైవర్ల సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వై.నాగేశ్వరావు, ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ ఎస్.నాగేశ్వరరెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. సభ్యులంతా ఈ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేపాల్‌లో 13న మానవ హక్కులపై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న మంత్రి శ్యాంప్రసాద్

డాబాగార్డెన్స్ : ఆసియా దేశాల్లో మానవ హక్కుల అమలు తీరుపై ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల మండలి వచ్చే నెల 13న నేపాల్ దేశం ఖాట్మాండ్‌లో అభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్టు మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993 కంటితుడుపుగా ఉందని, ఈ చట్టంపై ప్రజాప్రతినిధులకు అవగాహన లేదన్నారు. బాలల హక్కులు, మానవ హక్కులు, మహిళల హక్కులకు ఏర్పాటు చేసిన కమిషన్‌లకు అధికారాలు కల్పించాలని, రాజకీయ పునరావాస కేంద్రాల స్థాయి నుంచి విముక్తి కల్పించాలని నివేదిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో నేపాల్‌లో జరిగే సదస్సులో భారత్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలలో మానవ హక్కుల ఉల్లంఘనలు, చట్టాలు అమలు, తదితర అంశాలు చర్చించనున్నారని కౌన్సిల్ సభ్యుడు ఎం.సూర్యశ్రీనివాస్ తెలిపారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, పీపుల్స్ వాచ్, కామన్ వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇన్సియేటివ్, తదితర మానవ హక్కుల స్వచ్ఛంద సంస్థలు భారత్ నుంచి ఆహ్వానం అందుకున్నాయన్నారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు బీవీహెచ్ శ్రీరాములు, మార్టిస్ ఎరైనా, కె.రవికుమార్ పాల్గొన్నారు.

ఒడిశా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ కలయికలో 1993-94 పదో తరగతి విద్యార్థులు

ఆరిలోవ: ఒడిశా రాష్ట్రం రాయగడలోని గోపబంధు మున్సిపల్ హైస్కూల్ 1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమావేశం గురువారం నగరంలో ఓ హోటల్‌లో జరిగింది. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఎవరు ఎక్కడెక్కడ స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. విశాఖ, తిరుపతి, రాయగడ, శ్రీకాకుళం ప్రాంతాలతో పాటు ఆస్ట్రేలియా, ఆఫ్రికా దేశాలలో స్థిరపడినవారు ఈ ఆత్మీయ కలయికలో పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎం.మాధవి, ఎస్.శ్రీను, కె.వి.శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం



శిక్షణ తీసుకున్న విద్యార్థులతో బీఎస్ఎన్ఎల్ అధికారులు, ప్రిన్సిపాళ్లు

అల్లిపురం: బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో గత ఆరు నెలలుగా నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా డాబాగార్డెన్స్‌లో గల సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జనరల్ మేనేజర్ జి.ఆడమ్ మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ నైపుణ్య శిక్షణ ప్రాధాన్యతను వివరించారు. డిప్లమో విద్యార్థులకు బీఎస్ఎన్ఎల్ అన్నివిధాల సహకారం అందజేస్తుందన్నారు. డిజిటల్ ఇండియా మిషన్ కింద దేశాన్ని నిర్మించే సత్తా నేటి యువతకు ఉందన్నారు. విశాఖపట్నంలో బీఎస్ఎన్ఎల్ ట్రైనింగ్ ద్వారా అన్ని టెక్నికల్ సేవలు అందిస్తుందన్నారు. 6 నెలల శిక్షణ కాలంలో రెండు తరగతులు, నాలుగు నెలలు ఐపీ స్విచ్చింగ్ వంటి కార్యక్రమాలు, ఫీల్డ్ వర్కు జరిగిందన్నారు. కార్యక్రమంలో భీమిలి, చోడవరం, నర్సీపట్నం, అనకాపల్లి, పార్వతీపురం, కాకినాడ, నందిగామ, రేపల్లెకు చెందిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 224 మంది విద్యార్థులు శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పి.పాల్ విలియం, ఈబీ అండ్ శిక్షణ, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.సత్యప్రసాద్, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు జి.పద్మావతి, పి.అనురాధ, ఉషారాణి, అమర్నాథ్, కె.శ్రీనివాసరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు.

పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకం

సింహాచలం : అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో స్వామికి గురువారం సాయంత్రం త్రయోదశి ప్రదోష కాల అభిషేకాన్ని విశేషంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పునశ్చరణ తరగతులతో సమర్థవంతంగా విధులు



సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్

దొండపర్తి: ఆధునిక సమాజంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు పునశ్చరణ తరగతులు దోహదపడతాయని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఏఆర్ సిబ్బందికి మొబిలైజేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మొదటి విడతగా ఏఆర్ సిబ్బందికి 15 రోజుల పాటు పీటీ, డ్రిల్, యోగా, ఆయుధ తరగతులతో పాటు వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. విధి నిర్వహణలో నైపుణ్యం పెంపొందించుకునేందుకు ఈ శిక్షణ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 సునీల్ సుమిత్ గరుడ్, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, డీసీపీ (క్రైం) జి.నాగన్న, ఎస్‌బీ ఏడీసీపీ డి.గంగాధర్, ఏఆర్ ఏడీసీపీ కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీలు (ఏఆర్) ఆర్‌పీఎల్ శాంతికుమార్, జి.రాఘవేంద్రరావు, ఆర్‌ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్ సందర్శన



విద్యార్థులకు కమాండ్ కంట్రోల్ రూం పనితీరును వివరిస్తున్న స్మార్ట్‌సిటీ టీం ప్రతినిధి

డాబాగార్డెన్స్ :జీవీఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఐఐఎం విశాఖ విద్యార్థులు గురువారం సందర్శించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏ విధంగా జీవీఎంసీకి ఉపయోగపడుతుందో కమిషనర్ ఆదేశాల మేరకు స్మార్ట్‌సిటీ టీం ఐఐఎం విద్యార్థులకు వివరించింది. ఐఐఎం ప్రొఫెసర్ పీఆర్ఎస్ శర్మ నేతృత్వంలో 140 మంది విద్యార్థులు సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఉపయోగాలు, ముఖ్యంగా సీవోసీ ద్వారా విపత్తులు ముందుగా గుర్తించి ఆ ప్రాంత ప్రజలకు హెచ్చరికలు జారీ చేయడం, ట్రాఫిక్ నియంత్రణ, సీసీ కెమెరాలు సీవోసీకి అనుసంధానం చేయడం వల్ల నేరస్తుల గుర్తింపు, ట్రాఫిక్ ఐ ల్యాండ్ వద్ద పబ్లిక్ అనౌన్స్‌మెంట్, అత్యవసర కాల్ సెంటర్, నగర భద్రత తదితర పనులు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిర్వహిస్తామని స్మార్ట్ సిటీ టీం సభ్యులు తెలిపారు.

మాతా, శిశు మరణాల నియంత్రణకు చర్యలు



మాతా, శిశు మరణాలపై వైద్యులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: మాతా, శిశు మరణాల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆయన అధ్యక్షతన గురువారం మాతా, శిశు మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటి వరకు 11 మంది శిశువులు చనిపోయారని, ఇక ముందు ఇటువంటి మరణాలు సంభవించకుండా చూడాలన్నారు. వైద్యులు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముత్యమాంబ కాలనీ, చేపలుప్పాడ, దండుబజార్, పాత రేసపువానిపాలెం, చంద్రనగర్, గంగవరం, భవానీ గార్డెన్స్, లంకెలపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన పెదగంట్యాడ, రేవిడి, ఆనందపురంల్లో ఒక్కొక్కరూ చనిపోయారని వెల్లడించారు. సమావేశంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, డాక్టర్ బి.ఉమావతి, ఇతర అధికారులు బి.జ్యోతి, డీపీహెచ్ఎన్‌వో మురళీకృష్ణ తదితరులు పాల్గన్నారు.

ఘనంగా వేమన జయంతి



వేమన విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సంఘం ప్రతినిధులు

సీతమ్మధార : వేమన జయంతి సందర్భంగా ఆశీలమెట్టలో గల విశాఖ జిల్లా వేమన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా దివంగత నేత వై.ఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నీలాపు వివేకానందరెడ్డి మాట్లాడుతూ 18వ శతాబ్దం నాటి వేమన పద్యాలు ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉన్నాయన్నారు. మహనీయుడి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగాజరపడం పట్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. గౌరవ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సత్తి నాగేశ్వరరెడ్డి, సత్తిరామకృష్ణరెడ్డిలు మాట్లాడుతూ సరళమైన భాషలో అయన రాసిన పద్యాలు ఎంతో ప్రాచుర్యం పొందాయన్నారు. పండితులు, పామరులను అవి అలరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు బోర కుమార్‌రెడ్డి, ఏయూ పూర్వ అధ్యాపకులు తాతరెడ్డి, తిమ్మారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి, కర్రి రామారెడ్డి, దల్లి రామకృష్ణరెడ్డి, డీవీఎస్ ప్రసాద్‌రెడ్డి, బేరి గురుమూర్తిరెడ్డి, వేమన సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మహాగర్జనను విజయవంతం చేయండి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలు చేస్తున్న నాయకులు

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30వ తేదీన జరిగే మహా గర్జన జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పడాల రమణ పిలుపునిచ్చారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు 657వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఆటలు ఇకపై సాగవన్నారు. స్టీల్ ప్లాంట్, ఇతర దేశ సంపదలను కాపాడుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ని అమ్మడానికి మోదీ ప్రభుత్వానికి హక్కు లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అధికార, ప్రతిపక్ష ఎంపీలు, రాజ్యసభ సభ్యులు, అధికార పార్టీ నాయకులు ఐక్యంగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం మెడలు వంచాలని.. లేని పక్షంలో పాలకులకు ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో భీంపల్లి రాము, ఎ.కామరాజు, అప్పారావు, జి.వామనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌ను సందర్శించిన డీఎంహెచ్‌వో



కేజీహెచ్‌లో సిబ్బంది హాజరును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం కేజీహెచ్‌లో గల న్యూట్రిషన్ రేహాబిలిటేషన్ కేంద్రాన్ని సందర్శించారు. ఆయనతో డిస్ట్రిక్ట్ యార్లీ ఇంటర్వెన్షన్ కేంద్రాల ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సమత కూడా ఉన్నారు. ఈ సందర్భంగా అక్కడి వైద్యులు, సిబ్బంది హాజరును డీఎంహెచ్‌వో పరిశీలించారు. బయోమెట్రిక్, ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ (ఎఫ్ఆర్ఎస్) కచ్చితంగా వేయాలని అన్నారు. అనంతరం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్‌ను కలిసి పుట్టుకతో వచ్చే గుండె వ్యాధులు గల పిల్లల శస్త్ర చికిత్సలపై కుదుర్చుకున్న ఎంవోయూల కోసం వివరించారు. డాక్టర్ సమతను ఈ కార్యక్రమం అమలుకు పిల్లల వైద్యులు, డీఈఐసీ సెంటర్‌తో సమన్వయం చేసుకోవాలని డీఎంహెచ్‌వో సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

37వ వార్డు సమస్యలపై జెడ్సీకి వినతి



జెడ్సీకి వార్డు సమస్యలు విన్నవించుకుంటున్న కార్పొరేటర్ జానకీరామ్

డాబాగార్డెన్స్: జోన్-4 జోనల్ కమిషనర్ శివప్రసాద్ గురువారం జీవీఎంసీ 37వ వార్డులో వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్‌తో కలిసి పర్యటించారు. వార్డు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. పారిశుద్ధ్య కార్మికుల పనితీరు.. వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలు గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వార్డులో పలు సమస్యలు పరిష్కరించాలంటూ కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ జోనల్ కమిషనర్‌కు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బందితో పాటు వార్డు నాయకులు ఆకుల యేసు, రెయ్యి డేవిడ్‌రాజు, వాసు, సత్యవతి, సచివాలయ కన్వీనర్లు నిమ్మకాయల ఆదిలక్ష్మి, సారిక దైవకుమార్, ఆనంద్, రమణ, నెల్లి వంశీ, రామచంద్రరావు, శేఖర్, రోజా, రమణి పలువురు కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు మెడళ్లు



వైద్య విద్యార్థినికి ఆచార్య పెదవీర్రాజు గోల్డ్ మెడల్ అందజేస్తున్న డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: బయోకెమిస్ట్రీ పాథాలజీ, మైక్రోబయాలజీ, రేడియాలజీ విభాగాలు కలిగి ఉన్న పరిశోధనాత్మక వైద్య విభాగాల నుంచి ఉత్తమ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ పెదవీర్రాజు బంగారు పతకం కోసం పన్నెండు మంది పీజీ విద్యార్థులు పరిశోధన వర్క్‌ను సమర్పించారు. అందులో ఐదుగురిని తుది ప్రదర్శనకు ఎంపిక చేశారు. మైక్రోబయాలజీ విభాగంలో పీజీ విద్యార్థిని డాక్టర్ మౌనిక పెద్దపల్లి 2022 సంవత్సరానికి ప్రొఫెసర్ ఈ. పెదవీర్రాజు గోల్డ్ మెడల్ పొందారు. మరొక పరిశోధనకు గాను పాథాలజీకి చెందిన డాక్టర్ ఎస్. తానారి శ్రీకి కన్సొలేషన్ బహుమతి లభించింది. అమెరికాకు చెందిన గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ నాగుల సీతారామయ్య సమక్షంలో వైద్య విద్యార్థులకు ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ మెడళ్లు అందజేశారు. పతకాల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఏఎంసీ రీసెర్చ్ ఫోరం ప్రొఫెసర్ డాక్టర్ సామిని, ఇన్వెస్టిగేటివ్ మెడిసిన్ విభాగాల ఫ్యాకల్టీ, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.